పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# కూటమి ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత

## తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, మార్చి 12 ( ప్రభాత వార్త) : తణుకు నియోజకవర్గంలో నాబార్డు నిధులతో గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు చేపడుతున్నామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రూ. 18.44 కిలో మీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ. 9.59 కోట్లు నిధులతో గ్రామీణ పంచాయతీ రాజ్ శాఖ నుంచి పరిపాలన ఉత్తర్వులు వచ్చిందని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించిన వైసీపీ ప్రభుత్వం అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం వాటిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాబోయే వర్షాకాలం నాటికి నియోజకవవర్గంలో దాదాపు అన్ని రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. తణుకు మండలం మండపాక నుంచి దువ్వ, ఉరదాళ్లపాలెం వయా కొండాయపాలెం రోడ్డు 3.69 కిలోమీటర్లు మేర రూ. 2.03 కోట్లు, తణుకు మండలం వేల్పూరు రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి అత్తిలి కెనాల్ మీదుగా యర్రనీలిగుంట వరకు 2.91 కిలోమీటర్లు మేర రోడ్డు రూ. 1.70 కోట్లు, పైడిపర్రు నుంచి కొండాయపాలెం వరకు 2.82 కిలోమీటర్లు మేర రూ. 1.55 కోట్లు, జాతీయ రహదారి నుంచి ముద్దాపురం వరకు 2.57 కిలోమీర్లు మేర రూ. 1.42 కోట్లు, జాతీయ రహదారి నుంచి ఇరగవరం మీదుగా రామయ్యపుంత గట్టు వరకు 1.79 కిలోమీటర్లు మేర రూ. 99 లక్షలు, వేల్పూరు కావలిపురం మీదుగా మంగళ్లపుంత వరకు 1.04 కిలోమీటర్లు మేర రూ. 58 లక్షలు, తణుకు నుంచి అజ్జరం పుంత రోడ్డు 1.40 కిలోమీటర్లు రూ. 55 లక్షలు, అత్తిలి నుంచి గుమ్మంపాడు వరకు 2.20 కిలోమీటర్లు రూ. 77 లక్షలతో రోడ్డు నిర్మాణాలు చేపట్టామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రోడ్ల అభివృద్ధిలో భాంగా మొదటి దశలో నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రాధాకృష్ణ వివరించారు.



# మావుళ్ళమ్మకు బంగారం

భీమవరం మర్చి 12 ప్రభాతవార్త :శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి కి నిలువెత్తు సంపూర్ణ స్వర్ణమయం స్వర్ణ నిధికి వీరవాసరం కి చెందిన కొట్టి దుర్గా ప్రణీత్ (4 గ్రాముల 850 మిల్లిలు) బంగారం విరాళంగా అందచేసారు. వీరికి ఆలయ అర్చకులు పూజలు ఆశీర్వచనాలు నిర్వహించారు.,ఆలయ ధర్మకర్తలు రామాయణం శ్రీనివాస్, పాపోలు ఏడుకొండలు శేషవస్త్రం ప్రసాదం ఫోటో అందచేసారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



# జీన్ విప్లవం దిశగా పయనిద్దాం

## వ్యవసాయం లోనూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వాడండి

## వైయస్సార్ ఉద్యానవర్సిటీ ఉప కులపతి కె ధనుంజయ రావు పిలుపు

మార్చి 12, (పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో): మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యానవన రంగంలోనూ విప్లవాత్మక మార్పులు జరగబోతున్నాయనీ అందులో భాగంగా 'హరిత విప్లవం' (పరిమాణం) నుండి 'జీన్ విప్లవం' (విలువ) వైపు అంతా మళ్లాలని వైయస్సార్ ఉద్యానవర్సిటీ ఉప కులపతి డాక్టర్ కె ధనుంజయ రావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన అధ్యక్షతన, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఒ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ సి.హెచ్.రూత్ పర్యవేక్షణలో జరిగిన వెబినార్ లోఆయన ప్రసంగించారు. ప్రధానంగా 'దిగుబడి, నాణ్యత మరియు తెగుళ్ల నిరోధకత కోసం కూరగాయల పంటలలో ఆధునిక పద్ధతులు' అనే అంశంపై హైబ్రిడ్ మోడ్‌లో ఈ వెబినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాస్త్రవేత్త, మాజీ ఆచార్య ఎన్ జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డా॥ఆలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ కూరగాయల రంగంలో ఆధునిక జన్యు సాంకేతికత ప్రాముఖ్యతను వివరించారు. 100కు పైగా పంట వంగడాలను అభివృద్ధి చేసిన అనుభవంతో, ఆయన హైబ్రిడైజేషన్ మరియు గ్రాఫ్టింగ్ పద్ధతుల గురించి వివరించారు. ముఖ్యంగా పోషకాహార లోపాన్ని నివారించేందుకు క్యారెట్, పాలకూర వంటి పంటలలో బయో-ఫోర్టిఫికేషన్ పద్ధతులను అవలంబించాలని ఆయన సూచించారు. అనంతరం ఉ పకులపతి కె. ధనుంజయ రావు తన అధ్యక్ష ప్రసంగంలో భారతీయ ఉద్యానవన రంగం ఇప్పుడు వాతావరణ మార్పులను తట్టుకుంటూ, తక్కువ ఖర్చుతో కూరగాయల లభ్యతను పెంచడమే లక్ష్యంగా పరిశోధనలు జరగాలని కోరారు. దీనికోసం క్రిస్పర్ - కాస్9 వంటి జన్యు సవరణ సాంకేతికతలను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డిజిటల్




సాధనాలను వినియోగించుకోవాలని శాస్త్రవేత్తలకు సూచించారు. వైయస్సార్ ఉద్యానవర్సిటీ వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతుందని నూతన టెక్నాలజీ అందించడంలో అందరికీ అందుబాటులో ఉంటానని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. మాధవి, విశ్వవిద్యాలయ అధికారులు, వివిధ విభాగాల శాస్త్రవేత్తలు, విద్యార్థులు, నిపుణులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ

భీమవరం మర్చి 12 ప్రభాతవార్త : పదో తరగతి పరీక్షలు సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారికి 3000 పెన్నులు, పెన్సిల్, స్కేల్స్ తో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈనెల 16 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలలో భాగంగా గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ దాతలు కాకులపాటి భానుమూర్తి, బోడపాటి వినయ్, మానేపల్లి తేజ, సురేష్, యర్రంశెట్టి విజయ్, మావూరి సుందర్ రావు, భూపతిరాజు మనస్విని, మహేంద్ర వర్మ లచే అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి పెన్నులు, పెన్సిల్, స్కేల్ లతో అలంకరణ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పెన్నులను పేడ్స్ అందజేశారు. ఈనెల 16వ తేదీ వరకు విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# మంత్రి సారథి ఆశీస్సులతో

## ఏలూరు టిడిపి జిల్లా కార్యదర్శి రాజశేఖర్ జన్మదిన వేడుకలు

నూజివీడు, మార్చి 12 ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రి పార్థసారథి ఆశీస్సులతో ఏలూరు జిల్లా టిడిపి జిల్లా కార్యదర్శి తలపంటి రాజశేఖర్ జన్మదిన వేడుకలను నాయకులు ,అభిమానులు ఘనంగా నిర్వహించారు. మంత్రి సమక్షంలో రాజశేఖర్ కేక్ కట్ చేయగా మంత్రి పార్థసారథి రాజశేఖర్ కు కేక్ తినిపించారు. ఈ సందర్భంగా మంత్రి ఆశీర్వదిస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో , సంతోషంగా ఉండాలన్నారు. జిల్లాలో పార్టీని కూడా బాగా బలోపేతం చేయాలన్నారు. స్థానిక ఎం ఆర్ అప్పారావు కాలనీ లో రాజశేఖర్ అభిమానులతో కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ,వార్డు ఇన్చార్జిలు తదితరులు



పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి జిల్లాలో టూరిజం అభివృద్ధికి

## హోటల్స్ నిర్మాణాలకు చర్యలు తీసుకోండి

**- గుర్తించినప్రదేశాల్లో టూరిజం అభివృద్ధి**
**- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**




భీమవరం మార్చి 12ప్రభాతవార్త : అమరావతి సచివాలయం ఐదవ బ్లాక్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం నిర్వహించిన రెండవ రోజు కలెక్టర్ ల సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. టూరిజం అభివృద్ధి పై చర్చకు వచ్చిన సందర్భంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవిస్తూ జిల్లాలో ప్రభుత్వ భూములు కొరత ఉందని తమరికి తెలిసిందేనని, జిల్లాలోని రెండు ప్రదేశాల్లో ఆర్ అండ్ బి స్థలాలను గుర్తించి పర్యాటకం అభివృద్ధిలో భాగంగా హోటల్స్ నిర్మాణానికి ప్రతిపాదనలను టూరిజం అండ్ కల్చర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ కు ప్రతిపాదనలను పంపడం జరిగిందన్నారు. జిల్లాలో గుర్తించిన ఆర్ అండ్ బి స్థలాలను పర్యాటక శాఖకు అప్పగించేందుకు తగు ఆదేశాలను ఇప్పించవలసిందిగా ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ విన్నవించడం జరిగింది. ఈ సందర్భంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందిస్తూ ఆ భూములను జిల్లా యంత్రాంగానికి వెంటనే అప్పగించాలని ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి కృష్ణ బాబును ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణ బాబు మాట్లాడుతూ తమ ఆదేశాల మేరకు భూములు మంజూరు చేసేందుకు ఆర్డిసి సైట్ రూపొందించడం జరిగింది అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని భూములు చాలా ఖరీదైనవని అక్కడ హోటల్స్, లేక కమర్షియల్ యాక్టివిటీ ఏది అనుకూలమో పరిశీలించి భూములను అప్పగిస్తామని కృష్ణ బాబు ముఖ్యమంత్రికి తెలియజేయడంతో, వెంటనే ముఖ్యమంత్రి మాట్లాడుతూ కమర్షియల్ ప్లాన్స్ చేస్తే టూరిజం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. కావాలంటే మల్టీస్టోర్డ్ భవనాన్ని నిర్మించి ఒక ఫ్లోర్ లో కమర్షియల్ కాంప్లెక్స్ కూడా పెట్టుకోవచ్చుని సూచించారు. పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలలో పర్యాటకం అభివృద్ధి చెందాలంటే హోటల్స్ రావాలని, షాపింగ్ మాల్స్ ఎవరైనా కట్టుకుంటారని ఈ సందర్భంగా తెలిపారు. కమర్షియల్ ప్రాధాన్యత కన్నా, ప్రమోషన్ కు ప్రాధాన్యతను ఇవ్వాలని, మనం అనుకున్న విధంగా అందరూ కూడా ముందుకు నడవాలి అన్నారు. వెంటనే టెండర్లు పిలవాలని టూరిజం సెక్రటరీ అజయ్ జైన్ ను ఆదేశించారు. ప్రతి ఒక్క జిల్లాలో అవసరమైన రూమ్స్, హోటల్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. లేకపోతే భీమవరం వచ్చిన వాళ్ళు ఉదయం వచ్చి సాయంత్రం వెళ్ళిపోతారని ఒక్క రాత్రి కూడా బస చేయకపోతే ఆర్థిక అభివృద్ధి ఎలా జరుగుతుందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. జిల్లాలో డ్రోన్స్ ద్వారా విద్యుత్తు లైన్ లు నిర్మాణం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. ఈ ఆలోచన వినూత్నంగా ఉంది అని జిల్లా కలెక్టర్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. డ్రోన్ల వినియోగంపై ముఖ్యమంత్రికి వివరిస్తూ, జిల్లాలో 45 డ్రోన్లను వ్యవసాయ సాగుకు వినియోగిస్తున్నామని, దీనితోపాటు ఎలక్ట్రికల్ లైన్ లు నిర్మాణానికి డ్రోన్లను పోల్ టు పోల్ వైర్ ను అందించడానికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. దీనివలన తక్కువ టైంలో విద్యుత్ లైన్ల నిర్మాణ పనులను పూర్తి చేయడానికి వీలవుతుందని తెలిపారు. ఇది చాలా వినూత్నంగా ఉందని, నేనెప్పుడూ వినలేదని జిల్లా కలెక్టర్ ను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ డ్రోన్లు ఏ శాఖ వినియోగించిన శిక్షణ, తయారీలపై అవగాహన కల్పించాలని సూచించారు.

# ఇంటి పన్ను వసూలు పై దృష్టి సారించండి

చాట్రాయి, మార్చి 12, ప్రభాతవార్త : ఇంటి పన్ను వసూలు పై పూర్తిస్థాయిలో దృష్టి సారించి మండలాన్ని ప్రథమ స్థానంలో నిలవాలని చాట్రాయి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి రాజు అన్నారు. గురువారం చిన్నంపేట సచివాలయాన్ని ఆయన సందర్శించి గ్రామంలో ఇంటి పన్ను వసూలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 25 లోగా పూర్తిస్థాయిలో ఇంటి పన్ను వసూలు జరగాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఇంటి పన్ను వసూలుపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని అందువల్ల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఇంటి పన్నులు వసూలు కార్యక్రమంలో నిమగ్నం అవ్వాలని ఆయన కోరారు.



# శ్రీరామాలయం పునఃనిర్మాణం - వైభవంగా విగ్రహ ప్రతిష్ట

పోడూరు, మార్చి 12,ప్రభాత వార్త : మండల కేంద్రమైన పోడూరు పెదపేటలో సుమారు 76 ఏళ్ల క్రితం నిర్మించబడిన శ్రీరాముని ఆలయం శిధిలావస్థకు చేరడంతో దాతల సహకారంతో పునఃనిర్మాణం చేపట్టారు. గ్రామ టిడిపి నాయకులు, దాత రుద్రరాజు విశ్వనాథరాజు--లక్ష్మి దంపతుల కుమారుడు రుద్రరాజు బంగార్రాజు ఆధ్వర్యంలో ఆలయాన్ని పునఃనిర్మించి గురువారం శుభ ముహూర్తాన శ్రీరాముడు, సీతాదేవి, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో అలంకరించి మేళతాళాలు, భజంత్రీలు, బాణసంచాతో ఉత్సవ వాతావరణం నెలకొల్పారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దాత రుద్రరాజు బంగార్రాజు, శ్రీదేవి



దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరు సూరిబాబు, సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, మూలేశ్వర స్వామి, రాజేశ్వర స్వామి, కేశవ స్వామి దేవస్థానాల చైర్మన్ కోనూరు వెంకట రామ సత్య సూర్యనారాయణరాజు, ఉపసర్పంచ్ శీలబోయిన జయరామకృష్ణ, పోడూరు టీడీపీ మండల అధ్యక్షులు రుద్రరాజు రమేష్ రాజు, తోలేటి వేణు, పసుమర్తి మణి,గ్రామ పెద్దలు కన్నరాజు, గంట లాల్ బాబు, కాకర వెంకటేశ్వరరావు, జి. భాస్కరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 14 నుండి చర్లపల్లి - కామాఖ్య 'అమృత్ భారత్' వీక్లీ ఎక్స్‌ప్రెస్

## -కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ కృషితో జిల్లాకు దక్కిన మరో సౌకర్యం

భీమవరం, మార్చి12 ప్రభాతవార్త సామాన్య ప్రయాణికులకు అత్యున్నత స్థాయి ప్రయాణ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమృత్ భారత్' ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు మన పశ్చిమగోదావరి జిల్లా వాసులకు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ నిరంతర కృషి తో చర్లపల్లి (తెలంగాణ) నుండి కామాఖ్య (అస్సాం) మధ్య నడిచే రైలు నెం. 15673/15674 కు మన జిల్లాలోని భీమవరం టౌన్, తణుకు రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ (స్టాపింగ్) కల్పించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ?ప్రారంభ సర్వీస్: మార్చి 13వ తేదీన చర్లపల్లి - కామాఖ్య 'అమృత్ భారత్' వీక్లీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ప్రారంభం అవుతుండగా ఈ రైలు 14వ తేదీ తణుకులో రాత్రి 10:50 గంటలకు, భీమవరం టౌన్‌లో రాత్రి 11:30 గంటలకు చేరుకుంటుంది. 15వ తేదీ చర్లపల్లి స్టేషన్ కు ఉదయం 8.30కి చేరుకుంటుంది. మార్చి 18, 2026 (బుధవారం) నుండి ఈ రైలు వీక్లీ రెగ్యులర్ సర్వీస్ ప్రారంభం కానున్నాయి.రైలు నెం. 15673 - చర్లపల్లి నుండి కామాఖ్య ?ప్రతి బుధవారం రాత్రి 19:40 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి ?మరుసటి రోజు గురువారం తెల్లవారుజామున 04:00 గంటలకు భీమవరం టౌన్ స్టేషన్‌కు, 04:30 గంటలకు తణుకు స్టేషన్‌కు చేరుకుంటుంది. రాజమండ్రి, దువ్వాడ మీదుగా శుక్రవారం రాత్రి 22:00 గంటలకు కామాఖ్య చేరుకుంటుంది.?తిరుగు ప్రయాణంలో రైలు నెం. 15674 - కామాఖ్య నుండి చర్లపల్లి ?ప్రతి ఆదివారం రాత్రి 19:00 గంటలకు కామాఖ్యలో బయలుదేరి ?మంగళవారం తెల్లవారుజామున 05:48 గంటలకు తణుకు, 06:18 గంటలకు భీమవరం టౌన్ కు మధ్యాహ్నం 14:40 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది.అత్యాధునిక సదుపాయాలతో రూపొందించబడిన ఈ 'అమృత్ భారత్' ఎక్స్‌ప్రెస్‌లో మొత్తం 22 కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. ఇందులో 8 స్లీపర్ క్లాస్ కోచ్‌లు, 11 జనరల్ కోచ్‌లు ఉండగా, పూర్తిగా నాన్-ఏసీ కోచ్‌లతో సామాన్య మానవుడి రైలుగా దీనిని తీర్చిదిద్దారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఒక ప్యాంట్రీ కార్ కూడా ఈ రైలులో అందుబాటులో ఉంటుంది. మెరుగైన భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని తక్కువ ధరకే సామాన్యులకు అందించడం ఈ రైలు ప్రధాన ఉద్దేశం.?జిల్లాలోని వ్యవసాయ కూలీలు, చిన్న



తరహా వ్యాపారులు, ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఈ రైలు భీమవరం టౌన్, తణుకు స్టేషన్లో ఆగాలని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ రైల్వే బోర్డుకు పంపిన ప్రతిపాదనకు సానుకూల స్పందన రావడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ సందర్భంగా ఆకాంక్షించారు. అత్యధిక వేగంగా ప్రయాణించే వందే భారత్ ఈ ప్రాంతానికి సాధించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ఇప్పుడు అత్యాధునిక సదుపాయాలతో ఉ ఒడే సామాన్యుని రైలు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ కు జిల్లా వాసులకు అందుబాటులోకి తీసుకువచ్చినందుకు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ కృషిని స్థానికులు అభినందిస్తున్నారు.

# రేవు పాట వాయిదా

నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం సఖినేటిపల్లి మధ్య వశిష్ట నదిపై నరసాపురం వద్ద గల పంటు రేవు వార్షిక పాట గురువారం వాయిదా పడింది. పాలనాపర మైన కారణాలతో రేణు పాటను వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీవో ఎన్ రెడ్డి తెలిపారు. సకాలంలో షెడ్యూల్స్ అమ్ముడైన గత సంవత్సరం కన్నా రేవు పాటను తగ్గించి కోడ్ చేయడమే కారణమని భావిస్తున్నారు. ఈ రేవుపై యేటా 4 కోట్లు పైగా ఆదాయం వస్తుంది.



# డాక్టర్ చంద్రలేఖ కుటుంబాన్ని పరామర్శించిన పొత్తూరి

మొగల్తూరు మార్చి 12 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామపంచాయతీ పరిధి మోళ్లపర్రు గ్రామస్తులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్రీ ఏసు కుమార్తె డాక్టర్ చంద్రలేఖ ఇటీవల అనుమాదస్పద స్థితిలో మృతి చెందడంతో గురువారం నరసాపురం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు చంద్రలేఖ కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు వారితో పాటుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు వాతాడి ఉమామహేశ్వరరావు మొగల్తూరు మండల టిడిపి అధ్యక్షులు గుబ్బల నాగరాజు గ్రామ పార్టీ ప్రెసిడెంట్ వర్మ తిరుమణి ఏడుకొండలు తదితరులు ఉన్నారు



# రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం - బడాబాబుల వరం

కలిదిండి మార్చి 12 (ప్రభాతవార్త) : ప్రభుత్వ భూములు అంటేనే మావేనన్నట్టుగా కొంతమంది బడాబాబులు రెచ్చిపోతూ విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు. దీంతో బడా బాబులకు కలిదిండి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వరంగా మారింది. అసైన్మెంట్ భూముల ఆక్రమాలపై కలిదిండి రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. ముడుపులకు లొంగిపోయి కోట్ల రూపాయల విలువైన అసైన్మెంట్ భూములను అక్రమార్కులకు కట్టపెడుతుండటంపై ప్రజలనుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ చట్టాలను తుంగలో తొక్కుతూ అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహరిస్తూ భాస్కరరావుపేట అసైన్మెంట్ భూముల అక్రమాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న కలిదిండి రెవెన్యూ యంత్రాంగం పై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ చట్టాలను అమలు చేయకుండా కోట్ల రూపాయల విలువైన అసైన్మెంట్ భూములను బడాబాబులకు కట్టబెడుతూ ప్రభుత్వానికే మస్కా కొడుతున్న కలిదిండి రెవెన్యూ అధికారుల పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమార్కుల చెరలో ఉన్న అసైన్మెంట్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు అందజేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కలిదిండి మండలం భాస్కరరావుపేట అసైన్మెంట్ భూముల



అక్రమాలపై ఉక్కుపాదం మోపి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# బినామీ చేతిలో చౌకడిపో అడిగేవారు లేరు పో

మొగల్తూరు మార్చి 12(ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో 48వ నెంబర్ గల చౌక డిపో బినామీ పేరుతో నడుస్తుందని, ఎన్నిసార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ముత్యాలపల్లి గ్రామానికి చెందిన కొల్లాటి వెంకటేశ్వర్లు ప్రభాతవార్తకు తెలిపారు. వివరాల్లోకెళితే గ్రామంలోని 48 వ నెంబర్ గల చౌక దుకాణం దొంగ నాగమణి భర్త శ్రీనివాసరావు పేరున ఉందని ఈ షాపును అదే గ్రామానికి చెందిన అడబాల సత్యనారాయణ 40 సంవత్సరముల నుండి బినామీగా నిర్వహిస్తున్నారని ఈ షాపుపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పౌర సరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పక్కనే గోదావరి, పెద్ద కాలువ అయినా త్రాగునీరు సమస్యే...



నరసాపురం మార్చి 12 : ప్రభాతవార్త : పక్కనే గోదావరి ఉన్నా నిడదవోలు నరసాపురం పెద్ద కాలువ ప్రవహిస్తున్న త్రాగునీరు సమస్య మాత్రం అధికంగా ఉండటం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి, ప్రజా చైతన్య పాదయాత్ర దళ నాయకులు జే.ఎన్.వి.గోపాలన్ విమర్శించారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర నరసాపురం మండలం మీదుగా పట్టణంలో పద్మశ్రీ కాలనీకి గురువారం చేరింది. ఈ సందర్భంగా పాదయాత్రకు అపూర్వ స్వాగతాన్ని తెలియజేస్తూ ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. రోడ్డు నిర్మాణం, ఇళ్ల స్థలాలు, త్రాగునీరు పెన్షన్లు సమస్యలతో పాటు పద్మశ్రీ కాలనీలో దాహార్తి తీర్చడానికి పాలకులు చర్యలు తీసుకోవడం లేదని మంచినీళ్లు కోసం వెళ్లి ప్రమాదాలకు గురై అనేకమంది చనిపోయారని పద్మశ్రీ కాలనీవాసులు వాపోయారు. సరిపల్లి పంచాయతీలో ఉన్న ఈ కాలనీ నరసాపురం మున్సిపాలిటీకి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. సరిపల్లి పంచాయతీకి మాత్రం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సమస్యలను పంచాయతీ తీర్చలేదు మున్సిపాలిటీకి పరిధి కాదు అన్నట్లుగా మారింది. ఈ సందర్భంగా జె ఎన్ వి గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వం వాగ్దానాలు చేసి పక్కనపెట్టిందని కనీసం ప్రజల దాహార్తిని తీర్చడానికి కూడా పాలకులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. త్రాగునీటి సమస్య ఈరోజు కొత్తగా వచ్చింది కాదని ప్రభుత్వాలు పాలకులు మారుతున్నప్పటికీ ఓట్ల కోసం మాయ మాటలు చెప్పడం గెలిచాక వాగ్దానాలను నెరవేర్చకపోవడం పాలకులకు రివాజు గా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద సిటీలుగా మార్చేస్తాం, అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తాం అంటూ కబుర్లు చెబుతూ కనీస సౌకర్యాలను కూడా తీర్చకపోవడం బాధాకరమని అన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తామని, స్మార్ట్ సిటీలు నిర్మిస్తామని వికసిత్ ఆంధ్రప్రదేశ్ గా మార్చేస్తామని పెద్దపెద్ద మాటలు చెప్పే ఈ పాలకులు త్రాగునీరు రోడ్డు పెన్షన్ ఇల్లు ఇళ్ల స్థలాలు లాంటి సమస్యలను సమస్యలుగా చూడటం లేదని అన్నారు. పేదలకు ఇస్తున్న సబ్సిడీలు సంక్షేమ పథకాలు లెక్కలు చెబుతూ ఇన్ని కోట్లు ఖర్చు పెడుతున్నాం అన్ని కోట్లు ఖర్చు పెడుతున్నాం అంటూ చెప్పే మాటలు మోసపూరితమైనదని అన్నారు. ఒక సంవత్సరం బడ్జెట్లో పేదల సంక్షేమానికి ఖర్చు పెట్టేది ఎంతో పెద్దలకు ఇచ్చే రాయితీలు ఎంతో లెక్కలు చెప్పాలని అన్నారు.

# ఆధార్ కావాలంటే ఆమడ దూరం వెళ్లాల్సిందే

**-మండలంలో అందని ఆధార్ సేవలు**
**- అవస్థలు పడుతున్న ప్రజలు**




ప్రభాతవార్త చాట్రాయి : చాట్రాయి మండలంలో ఆధార్ కార్డు కావాలన్నా చేర్పులు మార్పులు చేసుకోవాలన్న మరో మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఆధార్ ప్రైవేట్ సెంటర్లు ఉండగా గత వైసిపి ప్రభుత్వం ప్రవేట్ సెంటర్లకు మంగళం పాడింది. గ్రామ సచివాలయాల్లోనే ఆధార్ కార్డులు తీసే విధంగా డిజిటల్ అసిస్టెంట్లను ఆపరేటర్లుగా నియమించారు. మండలంలో చాట్రాయి, తుమ్మ గూడెం, నరసింహారావు పాలెం గ్రామాలలో ఆధార్ కార్డులు తీసేందుకు ఏర్పాటు చేయగా ఈ సెంటర్లో పని చేస్తున్న ఆపరేటర్లు బదిలీపై వెళ్లారు. మండల కేంద్రమైన చాట్రాయి సచివాలయం నుండి ముసునూరు మండలానికి సుమారు రెండు సంవత్సరాలు క్రితం వెళ్ళగా ఇప్పటివరకు ఆపరేటర్ లేకపోవడంతో ఆధార్ సెంటర్ మూతపడింది. ఇక తుమ్మగూడెం,నరసింహారావు పాలెం గ్రామాలలో ఆపరేటర్లు ఇటీవల ప్రభుత్వం జరిపిన బదిలీలలో స్థానచలనం చెందారు. ఈ ప్రక్రియ పూర్తయి కూడా ఐదు మాసాలు పూర్తవుతున్నప్పటికీ ఆపరేటర్లను నియమించకపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. శిశు ఆధార్ సెంటర్ లు మండలంలో రెండు ఉన్నప్పటికీ పుట్టిన తేదీ మార్పులు, ఆధార్ అప్డేట్ చేయటానికి వీలు లేక ప్రజలు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, లేని పక్షంలో తెలంగాణ రాష్ట్రంలోని సత్తుపల్లి తదితర దూర ప్రాంతాలకు వెళ్లి ఆధార్ కార్డు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల ముందుకే పాలన అంటూ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ సచివాలయాల్లో సరైన సిబ్బంది లేక ఒక్క పని కూడా సత్వరమే పరిష్కారం అయ్యే పరిస్థితి కానరావడం లేదు. ప్రజలు ఇన్ని అవస్థలు పడుతున్నప్పటికీ మండల స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు ఎందుకు సమాచారం అందించటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆధార్ కార్డు కోసం ఊర్లు పట్టుకుని తిరగాల్సిన దుస్థితి రావటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చాట్రాయి మండలంలో ఆధార్ సెంటర్లు పునః ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పేదలకు సంక్షేమ పాలన అందించిన ఘనత వైకాపాదే



జీలుగుమిల్లి, మార్చి 12, (ప్రభాతవార్త): రాష్ట్రంలో పేద ప్రజలకు సంక్షేమ పాలన అందించిన ఘనత వైకాపాదేనని ఆ పార్టీ మండల కన్వీనర్ సందా ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రం జీలుగుమిల్లిలో వైకాపా 16వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైకాపా కార్యకర్తలు అందరూ ఒకే త్రాటిపై ఉండాలని, రానున్న అసెంబ్లీ ఎన్నికలలో వైకాపా విజయమే ధ్యేయంగా పనిచేయలన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో దేశంలో మరే ప్రభుత్వం అందించని గొప్ప సంక్షేమ పాలనను వైయస్ జగన్మోహన్ రెడ్డి అందించారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు విసిగిత్తి పోతున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు కావడం లేదని విమర్శించారు.

## ద్వారకాతిరుమలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ
# 16వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ



ద్వారకాతిరుమల,మార్చి 12 ( ప్రభాతవార్త ):ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, కేక్ కట్ చేసి పార్టీ స్థాపన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ పాల్గొని పార్టీ అభివృద్ధి, భవిష్యత్ లక్ష్యాలపై మాట్లాడారు. మండల యువజన విభాగ అధ్యక్షుడు నాగేశ్వరావు, టౌన్ ప్రెసిడెంట్ బాబు తదితరులు కూడా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లి సుబ్బారావు, చిలుకూరు నాగ సుబ్రహ్మణ్యం, మొలకల పానకాలు, దూలపల్లి ప్రసాదు, బొండదం సాత్విక రావు, చిలుకూరు చంద్రశేఖర్, ఒక్కటి వెంకట్రావు తదితర నాయకులతో పాటు స్థానిక ప్రజలు, ఆటో యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పి 4 కార్యక్రమంలో ఆటోలు పంపిణీ

ఆగిరిపల్లి మార్చి 12 ప్రభాతవార్త. పి4 కార్యక్రమంలో భాగంగా నూజివీడు సీడ్స్ అధినేత మండవ ప్రభాకర్ రావు (మండవ ఫౌండేషన్) సౌజన్యంతో గురువారం స్థానిక ఆగిరిపల్లి మండల కార్యాలయ ఆవరణలో 6 గురు లబ్ధిదారులకు ఆటోలు పంపిణీ చేశారు. వీటిలో ఒక ఎలక్ట్రికల్ ఆటో, ఒక ట్రక్ ఆటో, నాలుగు సీఎన్జీ ఆటోలు పంపిణీ చేశారు. ఆటోలను పి4 కోఆర్డినేటర్ బెల్లం సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ మండవ వెంకటేశ్వరావు, ఎంపీడీవో అబ్దుల్ సలాంలు లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా పి. ఫోర్ కోఆర్డినేటర్ సుబ్బారావు మాట్లాడుతూ పి4 పథకం ద్వారా ఇప్పటివరకు సుమారు వంద మంది లబ్ధిదారులకు కుటుంబ అవసరాల మేరకు గేదెల పంపిణీ, బడ్డీ కొట్లు, పిండి మిల్లులు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. గురువారం మొత్తం 9 మంది కి ఆటోలు మంజూరు చేయగా, అందులో 6 గురికి పంపిణీ చేశామని, మిగిలిన మూడు ఆటోలను త్వరలో అందజేస్తామని చెప్పారు. ఎంపీడీవో అబ్దుల్ సలాం మాట్లాడుతూ నూజివీడు సీడ్స్ సంస్థ (మండవ ఫౌండేషన్) అందించిన ఈ ఆటోలను లబ్ధిదారులు జాగ్రత్తగా వినియోగించుకుని తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి4 కార్యక్రమం ద్వారా తమలాంటి పేద కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆటోలు అందడం వల్ల తమ కుటుంబాలకు స్థిరమైన ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. నూజివీడు సీడ్స్ అధినేత మండవ ప్రభాకర్ రావు కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి పార్థసారథి కృతజ్ఞతలు తెలియజేశారు.

# చిన్న వ్యాపారుల గ్యాస్ కొరత తీర్చండి
## డిసిసి అధ్యక్షుడు సీతారామ్



భీమవరం టౌన్, మార్చి 8 : ప్రభాతవార్త: పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధం ప్రభావంతో చమురు సరఫరా తగ్గిపోవడం తద్వారా జిల్లాలో వంటగ్యాస్ కు తీవ్ర కొరత ఏర్పడిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎ సీతారామ్ అన్నారు. సరఫరా తగ్గిపో వడంతో సిలిండర్లకు డిమాండ్ పెరిగిం దన్నారు. వినియోగదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్యాస్ సిలిండర్ పొందాలంటే ప్రతి వినియోగదా రుడు కనీసం వారం రోజుల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. ఈ పరిస్థితికి కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. మరో వైపు వాణిజ్య సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో చిన్న వ్యాపారస్తులు, ముఖ్యంగా హోటల్ వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సీతా రామ్ విమర్శించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గ్యాస్ కొరత ఏర్పడే ప్రమాదాన్ని ముందుగానే కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారని గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని అన్నారు. ఈ సమస్యలపై రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు జిల్లా అధ్య క్షులు అంకెం సీతారామ్ ప్రకటించారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ బోనం రవికు మార్ భీమవరం మండల కాంగ్రెస్ పార్టీఅ ధ్యక్షులు అయినంపూడి వెంకటరామరాజు పాకర్ల రమేష్ బాబు,నాచు కృష్ణ మురళి (చిన్ని) కెల్లా నాయుడు ఏ మురళి హరిబళ్ళ నాయుడు, సోడాదాసి సిలివియా తది తరులు పాల్గొన్నారు

# ధాన ధర్మాలుకు రంజాన్ మాసం ప్రతీక
## ఎమ్మెల్యే పులపర్తి



భీమవరం మార్చి 12 ప్రభాతవార్త: ప్రతి ఒక్క ముస్లిం భక్తి, శ్రద్ధలతో ఆత్మను, శరీరాన్ని శుద్ధి చేసుకుంటూ, పేద ప్రజలకు దానధర్మాలను అవలంబించడం పవిత్ర రంజాన్ మాసం ప్రతీక అని భీమవరం శాసన సభ్యులు మరియు పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు అన్నారు. రంజాన్‌హా మాసాన్ని పరిష్కరించుకుని గురువారం జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోహా భీమవరం యల్.హెచ్.టౌన్ హాల్ నందుహా నిర్వహించిన "ఇఫ్తార్ విందు" కార్యక్రమంలోహా హాభీమవరం శాసనసభ్యులు మరియు రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ముస్లింలకు అత్యంత పవిత్రమైనది రంజాన్ మాసం అని, కఠినమైన ఉపవాస దీక్షతో శరీరాన్ని, ఆత్మని శుద్ధి చేసుకోవడంతో పాటు, పేదలకు సహాయంగా దానధర్మాలను చేయడం రంజాన్ మాసం విశిష్టత అన్నారు.హా ప్రతి ఒక్క ముస్లింకు మంచి జరగాలని,హా విద్యా, వ్యాపారం,హా ఉపాధిలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని ముస్లింలు అందరికీ రంజాన్ పర్వదినాలు సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలను శాసనసభ్యులుహా తెలిపారు.జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నెలరోజులు దీక్షలో పవిత్ర రంజాన్ మాసాన్ని ఆచరించడం జరుగుతుందని, అల్లా ఆశీస్సులతో ముస్లింలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నానన్నారు.హా భారతదేశంలో హిందూ, ముస్లిం సత్సంబంధాలతో మెలుగుతున్నారని, ఎల్లప్పుడు ఇలాగే కలిసి ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు.హా రంజాన్ మాసంలో ముస్లింలుహా స్వీయనియంత్రణతోహా అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఉపవాస దీక్షను కొనసాగిస్తారన్నారు.



# పి జి ఆర్ ఎస్ ఫిర్యాదుపై
## సబ్ కలెక్టర్ విచారణ



చాట్రాయి, మార్చి 12, ప్రభాతవార్త మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన బయగాని రామారావు పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేయగా గురువారం స్వయంగా చిన్నంపేట గ్రామానికి నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న విచ్చేసి పరిశీలన చేశారు. వైగారి రామారావు తనకి సంబంధించిన భూమిని ఎవరో ఆక్రమించుకున్నారని చెప్పగా నీ దగ్గర ఆధారాలు చూపించాలని సబ్ కలెక్టర్ అడగటంతో ఎటువంటి ఆధారాలు చూపించలేదు. దీంతో ఆధారాలు లేకుండా భూమి ఎలా వస్తుందని ఆమె ప్రశ్నించగా నన్ను గ్రామ పరిష్కారం చేశానని నిన్ను గ్రామానికి రాకుండా చూస్తున్నారని అందువల్లే ఈ విధంగా చేస్తున్నారని ఆరోపించారు. ఆరోపణలు కాదని ఆధారాలు కావాలని నీవు ఈ గ్రామంలోనే ఉండాలనుకుంటే ప్రభుత్వ భూమి ఇల్లు కట్టుకునేందుకు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ బాద్రునాయక్, ఎండిఓ రాజు, రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులు, సర్వేయరు తదితరులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ సిలండర్లు బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు



ఏలూరు, మార్చి 12 (ప్రభాత వార్త) : ఏలూరు జిల్లాలో గృహ వినియోగదారుల అవసరాలకు సరిపడా ఎల్పిజీ సిలిండర్ల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయనీ, ఎటువంటి కొరతా లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ తెలిపారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను ఆసరాగా తీసుకొని ఎల్పిజీ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, అధిక ధరలకు విక్రయించడం వంటి బ్లాక్ మార్కెటింగ్ చర్యలు ఎవరైనా చేపట్టినట్లయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. గ్యాస్ సరఫరాలో ఎటువంటి అక్రమ కార్యకలాపాలు జరగకుండా అధికారులు కఠినంగా పర్యవేక్షిస్తున్నారని, ప్రతి వినియోగదారునికి అవసరమైన గ్యాస్ సిలిండర్ అందేలా జిల్లా యంత్రాంగం మరియు ఆయిల్ కంపెనీలు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నాయి. ఏలూరు జిల్లాలో గృహ గ్యాస్ సరఫరా ఎటువంటి కొరతా కొనసాగుతోందన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వినియోగదారులకు నిరంతరంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాయనీ అలాగే డీలర్లు మరియు డెలివరీ వ్యవస్థ ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో ఎల్పిజీ సరఫరా నిలిచిపోయిందని లేదా కొరత ఏర్పడిందని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమన్నారు. ఇటువంటి వదంతులను నమ్మి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. . వదంతుల ప్రభావంతో కొంతమంది వినియోగదారులు ముందుగానే పెద్ద ఎత్తున రీఫిల్ బుకింగ్లు చేయడం వల్ల కొన్నిచోట్ల తాత్కాలికంగా బుకింగ్ మరియు సరఫరాలో స్వల్ప ఆటంకములు కలిగే ఆస్కారము కలదు అయితే ఇది గ్యాస్ కొరత కారణంగా కాకుండా అకస్మాత్తుగా పెరిగిన బుకింగ్ కారణంగా మాత్రమే జరుగుతోంది. ఏలూరు జిల్లా అంతటా ఎల్పిజీ గ్యాస్ సరఫరా సాధారణంగా కొనసాగుతున్నందున ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రజలు అపోహలు, వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని జేసీ విజ్ఞప్తి చేశారు.

# మాజీ కేంద్ర మంత్రి కావూరి మృతికి చింతలపూడి బిజెపి నేతల సంతాపం



కామవరపుకోట, మార్చి 12(ప్రభాత వార్త): మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ బిజెపి నేత కావూరి సాంబశివరావు గారి అకాల మరణం పట్ల చింతలపూడి బిజెపి నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని వారి నివాసంలో కావూరి భౌతికకాయానికి నివాళు లర్పించిన నేతలు, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన మరణం తీరని లోటని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం




అత్తిలి, మార్చి 12 (ప్రభాత వార్త) అత్తిలి మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అత్తిలి టీటీడీ కళ్యాణ మండపం వద్ద గల పార్టీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ కేకును కోశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్ధరాతి భరణి ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతి కార్యకర్త కష్టపడే పని చేయాలని కోరారు. పార్టీని తిరిగి అధికారులకి రప్పించేలా ప్రస్తుత ప్రభుత్వ లోపాలను ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, మద్దాల శ్రీనివాస్, పోలినాటి చంద్రరావు , జెడ్పి కో అప్టేట్ సభ్యుడు హాబిబుద్దీన్, కాకర్ల విశాలాక్షి, దిరిశాల నాగబాబు, రాయుడు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. ఒరిగేడు గ్రామంలో ఎంపీటీసీ అనిశెట్టి త్రిమూర్తులు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. బల్లిపాడు లో ధనుమూరి తాతాజీ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.

# హెచ్ పీ వి వ్యాక్సిన్ ను సద్వినియోగం చేసుకోండి



అత్తిలి / గణపవరం, మార్చి 12( ప్రభాత వార్త )గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద హెచ్ పి వి వ్యాక్సిన్ 14 సంవత్సరముల బాలికలకు వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ కె. ఓంకార్ నాథ్ తెలిపారు. ఈ టీకా వల్ల గర్భాశయ క్యాన్సర్ భవిష్యత్తులో రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు వ్యాక్సిన్ పై ఏ విధమైన అపోహలు పడకుండా పిల్లలకు ప్రభుత్వశీ ద్వారా చేస్తున్న వ్యాక్సిన్ వేయించాలని కోరారు.,అర్హులైన బాలికలు అందరికీ రోజువారీగా వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె.విల్సన్ బాబు, సి.పద్మజ,కే.సుహాసిని, యోహాను,ఎం .నల్లయ్య,ఆశ కార్యకర్తలు పాల్గొనినారు

# మిస్టరీగా మారిన యువకుడు మృతి

**- హత్య చేశారంటున్న మృతుని కుటుంబ సభ్యులు ధర్నా**
**- విచారణ చేసి న్యాయం చేస్తా ఎస్ఐ రామకృష్ణ**



చాట్రాయి, మార్చి 12, ప్రభాతవార్త : చాట్రాయి దీప చెరువులో పడి మృతి చెందిన యువకుడు అంబటి అనుదీప్(19) మృతి మిస్టరీగా మారింది. మృతుడు అనుదీప్ తల్లిదండ్రులు, బంధువులు స్నేహితులు గురువారం మధ్యాహ్నం ధర్నా నిర్వహించారు. చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన కొందరు యువకులు చెరువులోకి తోసి అచ్చి చేశారంటూ న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. మృతుడు అనుదీప్ పోలవరం గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమించినాడని ఆ యువతి తండ్రి అతని బంధువులతో కలిసి చెరువులోకి తోసి హత్య చేశారని దీనికి పూర్తి సాక్షాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ప్రియురాలు తండ్రి గతంలో తమ ఇంటికి వచ్చి మా అమ్మాయి తో మీ అబ్బాయి మాట్లాడితే చంపుతామని బెదిరించారని అదేవిధంగా బుధవారం మధ్యాహ్నం కూడా వచ్చారని పథకం ప్రకారం చంపారని ఫిర్యాదు చేశారు. సాయంత్రం 6 గంటల సమయంలో చెరువు దగ్గర ఫోన్ ఉండగా గంటలోనే పోలవరం ప్రియురాలి తల్లిదండ్రుల దగ్గర ఉందని ఇందులో మిస్టరీ ఏంటో తేల్చాలని డిమాండ్ చేశారు. ఫోన్ డేటాను సిసి కెమెరాలను పరిశీలించి న్యాయం చేయాలని లేని పక్షంలో ఉన్నతాధికారులు దృష్టికి వెళ్తామని మండుటెండలో రోడ్డుమీద బైఠాయించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు మందపాటి బసవ రెడ్డి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని చాట్రాయి ఎస్సై రామకృష్ణ కు విజ్ఞప్తి చేశారు.

**పూర్తిస్థాయి విచారణ చేస్తా : ఎస్ఐ**

మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని పూర్తిస్థాయిలో విచారణ చేసి మృతుని కుటుంబానికి న్యాయం చేస్తానని చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ హామీ ఇచ్చారు. చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో శవ పంచినామా పూర్తి పోస్టుమార్టం రిపోర్టు వస్తుందని ఈలోపు విచారణ జరిపి దోషులను వదలబోనని ఆయన హామీ ఇచ్చారు.

# భీమవరంలో టెన్నిస్ టోర్నమెంట్ మార్చి 14 నుండి 20 వరకు




భీమవరం టౌన్, మార్చి 12 : ప్రభాతవార్త : కాస్మోపాలిటన్ క్లబ్ – భీమవరం ఆధ్వ ర్యంలో 14వ తేదీ నుండి 20 వ తేదీ వరకు ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ కమిటీ తెలియజేసింది. గురువారం కాస్మో క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావే శంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్, యూత్ కల్చరల్ అసోసియేషన్, ఎల్ హెచ్ భీమవరం టౌన్ హాల్ డిఎన్ఆర్ కళాశాల ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల టెన్నిస్ కోర్టుల నందు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు 14,15 తేదీల్లో క్వాలిఫైయింగ్ పోటీలు, 16 నుండి 20 వ తేదీ వరకు ముఖ్య పోటీలు నిర్వహించబడతాయన్నారు. ఈ టోర్న మెంట్లో మెన్ ఏజ్ గ్రూప్స్ 35 ం 45ం 55ం 65ం 70ం సింగిల్స్, డబుల్స్ , మరియు 75ం (డబుల్స్ మాత్రమే). భీమవరంలోని స్థానిక ఆటగాళ్ల ప్రతిభను ప్రోత్సహించ దానికి అండర్ 30 పురుషుల ఛాంపియన్షిప్ నిర్వహిస్తున్నట్లు కమిటీ వెల్లడించింది. 8 సింగిల్స్ మరియు 4 డబుల్స్ జట్లు 18,19,20 తేదీల్లో జరగనున్నాయి. 16 వ తేదీన ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె రఘురామ కృష్ణంరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనే యులు, విశ్రాంత డిజిపి, ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నందూరి సాంబశివరావు, వెర్టెక్స్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వేగేశ్న వెంకటరాయ వర్మ తదితరులు విచ్చేస్తున్నట్లు వారు తెలిపారు. అన్ని రాష్ట్రాల నుండి ఆటగాళ్లు పాల్గొంటున్నట్లు, అందరికీ ఉచిత వసతిని కాస్మోపాలిటన్ క్లబ్, యూత్ కల్చరల్ అసోసియేషన్, అల్లూరి సీతారా మరాజు సేవాసమితి, డీఎన్ఆర్ కళాశాల, ఎల్ హెచ్ భీమవరం టౌన్ హాల్ లలో కల్పించనున్నారు. ఉదయం అల్పాహారం మరియు భోజన సదుపాయాలు క్లబ్ నందు ఏర్పాటు చేయుచున్నట్లు మరియు ఆటగాళ్లందరికీ పోటీలు నిర్వహించు కేంద్రాలకు ఉచిత రవాణా సౌకర్యం కూడా ఏర్పాటు చేయనున్నారు. టోర్నమెంట్ చైర్మన్ గా కాస్మో పోలిటన్ క్లబ్ అధ్యక్షుడు చేకూరి రామభద్రిరాజు, కాస్మోపాలిటన్ క్లబ్ వైస్ చైర్మన్ వేగేశ్న రమేష్, కాస్మో పోలిటన్ క్లబ్ కార్యదర్శి భూపతి రాజు సుబ్బరాజు, ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యు కృష్ణ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సీనియర్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఏ రాంబాబు, టోర్నమెంట్ డైరెక్టర్ గా యు ఆర్ పి ఆర్ వర్మ, సెక్రటరీగా వివి ఎస్ ఎస్ వర్మ, జాయింట్ సెక్రటరీగా ఎం విజయ్ వర్మ, ట్రెజరర్స్ గా కే సత్యనారా యణ మూర్తి, జి కిరణ్, అబ్జర్వర్ గా కె ఎస్ ఆర్ ఎ రాజు, టెన్నిస్ కోర్ట్స్ ఇన్చార్జిగా కె ఆర్ కె రాజు వ్యవహరించ నున్నారు. చేకూరి రామభద్రిరాజు, వేగేశ్న రమేష్, భూపతి రాజు సుబ్బరాజు, రుద్రరాజు సుబ్బరాజు, వబిలి శెట్టి రామకృష్ణ, కమిటీ సభ్యులు మరియు క్లబ్ సభ్యుల సహ కారంతో ఆంధ్రప్రదేశ్ సీనియర్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఏ రాంబాబు (హైదరాబాద్) యు ఆర్ పి ఆర్ వర్మ ల సహకారంతో టోర్నమెంట్ నిర్వహి స్తున్నట్లు కమిటీ వెల్లడించింది. ఈ పోటీలకు ముఖ్య స్పాన్సర్లుగా వెర్టెక్స్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ మరియు క్లబ్ సభ్యు లు , కమిటీ సభ్యుల ఆర్థిక సహాయ సహకా రాలతో నిర్వహించనున్నారు.

# శిక్షణ ఇచ్చారు.. కిట్టు మరిచారు

**- రెండు సంవత్సరాలు గడుస్తున్న టైలర్స్ కి ఇవ్వని విశ్వకర్మ కిట్లు**



వేలేరుపాడు, మార్చి 12 ( ప్రభాత వార్త ) : మండలంలో పలువురు టైలర్స్ కు పీఎం విశ్వకర్మలో భాగంగా శిక్షణ అనంతరం ఇవ్వవలసిన కిట్ నేటికీ ఇవ్వలేదని వెంటనే అవి ఇప్పించాలని స్థానిక టైలరింగ్ యూనియన్ నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విలేకరులకు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు.పీఎం విశ్వకర్మలో భాగంగా భీమవరంలో ఐదు రోజులు శిక్షణ ఇచ్చారని అన్నారు. అనంతరం టైలరింగ్ కిట్ ఇస్తామని తెలిపారన్నారు. ఇది జరిగి రెండు సంవత్సరాల అయినప్పటికీ నేటికీ కిట్ ఇవ్వలేదని అన్నారు. కొద్దిరోజుల క్రితం శిక్షణ తీసుకున్న కుక్కునూరుకు సంబంధించిన టైలరింగ్ వారికి కిట్ ఇచ్చారని పేర్కొన్నారు.మాకు రావాల్సిన కిట్ ఏమైందని ప్రశ్నించారు.గతంలో శిక్షణ ఇచ్చిన వారికి ఫోన్ ద్వారా అడగగా వారు ఉద్యోగం మానేశామని మాకు తెలియదని సమాధానం చెప్పారనీ అన్నారు. ఇప్పటికైనా మాకు ఎంతో అవసరమైన టైలరింగ్ కిట్టు శిక్షణ తీసుకున్నా మా అందరికీ ఇవ్వాలని కోరారు. కురిమెళ్ళ కృష్ణ,మహమ్మద్ జాఫర్ ఖాన్, అక్బర్ హుస్సేన్, అర్వా రాబర్ట్ కుమార్, షేక్ అజ్జి తదితరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.